క్లుప్తంగా

22 నుంచి పీసా కమిటీ ఎన్నికలు


ఎంపీడీవో ప్రసాదరావు

కొయ్యూరు: కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు మండలంలోని కినపర్తి, రాజేంద్రపాలెం, రేవళ్ల ప్రాంతాల్లో పీసా కమిటీ మండల కార్యదర్శి, ఉపాధ్యక్షుని ఎన్నికను నిర్వహిస్తామని ఎంపీడీవో ప్రసాదరావు బుధవారం తెలిపారు. దీనికి సంబంధించి రాజేంద్రపాలెంనకు బాలికల పాఠశాల హెచ్ఎం గోపాలంను ఎన్నికల అధికారిగా, కినపర్తికి ఏఎస్‌వో చైతన్యను, రేవళ్లకు సీడీపీవో ఎల్ దేవామణిని ఎన్నికల అధికారులుగా నియమించినట్టు తెలిపారు. దీనికి సంబంధించి ఈనెల 18న ఇక్కడ ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఈ మూడు పంచాయతీలకు పీసా కమిటీ ఎన్నికలను వివాదాల మూలంగా నిర్వహించలేదు. ఈ సారి వివాదాలు లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు చూస్తున్నారు.

156 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు


సీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీహెచ్‌సీలో బుధవారం 101 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఇందులో 24 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించి, ప్రత్యేక వైద్య సేవలందిస్తున్నారు. గైనకాలజిస్టు డాక్టర్ బి.మోమిన, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో 55 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులలకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు చేశారు.వారిలో 26 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించి ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. ఆయా శిబిరాలకు వచ్చిన గర్భిణులకు భోజన, వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన



ఖాళీ బిందెలతో నిరసన ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, స్థానికులు

హుకుంపేట: మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదివాసీ మహిళ గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మహిళ అధ్యక్షురాలు సొంటేన హైమావతి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామలతో పాటు మండల కేంద్రంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత్యంతరం లేక ఊటగెడ్డల నీటిని వినియోస్తున్నామన్నారు. ఎంపీడీవో కార్యలయంలో జిల్లా పంచాయిత్ రాజ్ శాఖ అధికారి కే.పి. చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు.

మారేడుమిల్లి ఎంపీడీవోకు పురస్కారం


కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా ప్రశంసపత్రం, మెడల్‌ను పొందుతున్న ఎంపీడీవో విశ్వనాథ్

రంపచోడవరం: మారేడుమిల్లి మండల ఎంపీడీవో తూతిక శ్రీనువాస్ విశ్వనాథ్‌కు మండలంలో ఉత్తమ సేవలందించినందుకు పురస్కారం అందుకున్నారు. పాడేరులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ బుధవారం ఎంపీడీవో విశ్వనాథ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసి సత్కరించారు. మండలం అభివృద్ధి కోసం కృషి చేసినందుకు ఆయనకు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

రహదారి భద్రతపై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, డ్రైవర్లు

ఎటపాక: రహదారి భద్రత, ప్రమాదాల నివారణపై పోలీసుల ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడువాయి నుంచి తెలంగాణ సరిహద్దు వరకు నినాదాలతో ర్యాలీ చేశారు. ఎస్ఐ అప్పలరాజు మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటించి పరిమితి ప్రకారం ప్రయాణికులను ఎక్కించుకోవాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు ప్రతి క్కరు నిబంధనలు పాటించాలన్నారు. యూనియన్ నాయకులు శంకర్, డ్రైవర్లు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం


పెదబయలు వారపు సంత ఆవరణలో చెత్త నిల్వలు

- సంత ఆవరణలో పేరుకుపోయిన చెత్త
- డంపింగ్ యార్డ్ లేక అవస్థలు
- దుర్గంధంతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు


పెదబయలు స్టేట్ బ్యాంకు సమీపంలో పేరుకుపోయిన చెత్త

పెదబయలు: మండలంలోని సీతగుంట పంచాయతీలో సేకరించిన చెత్తను పారవేయడానికి డంపింగ్ యార్డ్ లేకుండా పోయింది. దీంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. సీతగుంట పంచాయతీ పరిధిలో 11 గ్రామాల్లో ఉన్నాయి. మండల కేంద్రంలో వారానికి మూడు రోజుల పాటు పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను డంప్ చేయడానికి ఖాళీ సమస్య లేకుండా పోయింది. దీంతో పరిస్థితి దయనీయంగా మారింది.

సీతగుంట పంచాయతీ పంచాయతీ డంపింగ్ యార్డ్ కోసం పదేళ్ల క్రితం సీతగుంట గ్రామ సమీపంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు మత్స్యగెడ్డ ముంపు ప్రాంతంలో సుమారు 10 సెంట్లు ప్రభుత్వ భూమిని కేటాయించినట్టు అప్పట్లో రెవెన్యూ అధికారులు ప్రకటించారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ పంట పొలాలు ఉండడం, వర్షాకాలంలో గెడ్డ ముంపునకు గురవుతుందని గ్రామస్తులు చెప్పడంతో అక్కడ నుంచి పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–1కు మధ్య ప్రభుత్వ స్థలంలో డంపింగ్ యార్డ్‌ను 2014 – 2019 టీడీపీ ప్రభుత్వంలో సుమారు రూ.10 లక్షల నిధులతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు ప్రారంభించి, పిల్లర్స్ వరకు నిర్మించి వదిలేశారు.

దీంతో పదేళ్ల పాటు పనులు ముందుకు సాగడం లేదు. దీంతో సీతగుంట పంచాయతీకి డంపింగ్ యార్డ్ పెద్ద సమస్యగా మారింది. సీతగుంట పంచాయతీ పరిధిలో పలు ప్రదేశాల్లో ప్రభుత్వ స్థలం పరిశీలన చేసిన ఇండ్లకు, ప్రభుత్వ పాఠశాలలకు సమీపంలో ఉండడం వల్ల డంపింగ్ యార్డ్ నిర్మాణం ముందుకు సాగడం లేదు.


పెదబయలు పీహెచ్‌సీ సమీపంలో నిర్మాణానికి నోచుకోని డంపింగ్ యార్డ్

రోజుల తరబడి చెత్తకుప్పలు

పెదబయలు, సీతగుంట పంచాయతీలో సేకరించిన చెత్తను వారానికి మూడు రోజులపాటు చెత్తను సేకరించిన డంపింగ్ యార్డ్ లేకపోవడంతో వారపు సంత స్థలంలోనే చెత్త డంపింగ్ చేస్తున్నారు. సంత ఆవరణలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.2 లక్షల నిధులతో గిరిజన రైతులకు ఉపయోగకరంగా డిజిటల్ తూనికల కేంద్రం నిర్మించారు.అయితే కేంద్రం సమీపంలో చెత్త నిల్వలు ఉండడంతో సంతకు వచ్చిన ప్రజలు, వ్యాపారులు దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు.సంతకు ఆనుకుని ఓ ప్రైవేట్ పాఠశాల, వసతి గృహం ఉండడంతో దుర్గంధం, దోమల బెడదతో విద్యార్థులు సతమతమవుతున్నారని నిర్వాహకులు ఆవేదన చెందుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూడాలి

పెదబయలు మండలం సీతగుంట గ్రామ పంచాయతీలకు ఆనుకుని సీకరి, అరడకోట, అడుగులపుట్టు పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల పరిధిలో ప్రభుత్వ స్థలం గుర్తించి శాశ్వతంగా డంపింగ్ యార్డ్ నిర్మాణం చేసే దిశగా అధికారులు, గ్రామ పంచాయతీ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

కలెక్టర్ దృష్టికి సమస్య



సీతగుంట పంచాయతీ పరిధిలో డంపింగ్ యార్డ్ స్థలం కోసం అనేకసార్లు అధికారులకు విన్నవించాం. ప్రభుత్వ స్థలం ఉందని సర్వేయర్లు గుర్తించిన పూర్తిస్థాయిలో కేటాయించడం లేదు. జనావాసాలకు, పాఠశాలలకు సమీపంలో స్థలం గుర్తించడం వల్ల ఆయా ప్రాంత ప్రజలు వ్యతిరేకించడం వల్ల ముందుకు సాగడం లేదు. అలాగే పెదబయలు వైటీసీ, గురుకుల కళాశాల సమీపంలో ప్రభుత్వ స్థలం డంపింగ్ యార్డ్‌కు గుర్తించినట్టు అధికారులు తెలిపా. ప్రస్తుతం సేకరించిన చెత్త వేయడానికి స్థలం లేక తాత్కాలికంగా పెదబయలు వారపు సంత స్థలంలో డంప్ చేయడం జరుగుతోంది. కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి శాశ్వత పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తాము.

– పలాసి మాధవరావు, సర్పంచ్, సీతగుంట, పెదబయలు మండలం

స్థల సమస్య ఉంది



పెదబయలు సీతగుంట పంచాయతీకి డంపింగ్ యార్డ్ నిర్మాణానికి స్థల సమస్య ఉంది. పెదబయలు ఆస్పత్రి సమీపంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి పిల్లర్‌స్థాయి వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. రెవెన్యూ అధికారులు జనవాసాలకు ఇబ్బంది లేని ప్రదేశాలు గుర్తిస్తే బాగుండేది. చెత్త వేయడానికి స్థలం లేక సంత ఆవరణలో కొద్ది భాగంలో చెత్త వేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.

– ఎల్.పూర్ణయ్య, ఎంపీడీవో, మండల పరిషత్ పెదబయలు మండలం.

నిర్వాసిత కాలనీల్లో కనీస సౌకర్యాలు కరువు


నిర్వాసిత కాలనీలో చిత్తడి రహదారిని పరిశీలిస్తున్న మాల్యాద్రి

ఎటపాక: పోలవరం నిర్వాసితుల కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాల్యాద్రి అన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐవి తో కలిసి ఎటపాక మండలంలోని నర్సింగపేట, రాయనపేట, కన్నాయిగూడెం నిర్వాసిత కాలనీలను ఆయన బుధవారం సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం కోసం సర్వం త్యాగంచేసి ఇక్కడికి వచ్చిన ప్రజలకు కాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాసిరకంగా నిర్మించిన ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, డ్రైనేజీలు, వీధిలైట్లు, రహదారులు, తాగునీటి సదుపాయం కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ.600పైగా ఖర్చుచేసి తాగునీరు కొనుక్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రతీ నెల పింఛన్, రేషన్ కోసం 70 కిలోమీటర్లు సొంత గ్రామాలకు వెళ్తున్నారని, ,కాలనీల్లో బడి ,అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ఇంకా పూర్తికాలేదన్నారు. నిర్వాసితుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 16,17న పార్టీ అఖిల భారత కార్యదర్శి బేబి, పార్టీ రాజ్యసభ సభ్యుడు జాన్‌బ్రిటాస్ నిర్వాసిత కాలనీల్లో పర్యటిస్తారని చెప్పారు.

గ్రామాల్లో ఆధార్ డ్రైవ్

కొయ్యూరు: గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాదరావు తెలిపారు. మండలంలోని రావణాపల్లిలో ఈనెల 14 నుంచి 16 వరకు, ఆడాకులలో 18,19 తేదీల్లో , అంతాడలో 22, 23 తేదీల్లో, బకులూరులో 25 నుంచి 28వ తేదీ వరకు తాత్కాలిక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. కొయ్యూరులో కొద్ది రోజులుగా మూసివేసిన ఆధార్ కేంద్రాన్ని తెరిచారన్నారు. ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ డ్రైవ్‌ను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


ఎంపికైన గ్రామ కమిటీ నేతలతో ఎంపీపీ కుమారి తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని శంకాడలో ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, సర్పంచ్ నాగులమ్మ ఆధ్వర్యంలో పార్టీ గ్రామ కమిటీలను బుధవారం ఏర్పాటు చేశారు. పార్టీ పంచాయతీ అధ్యక్షుడిగా మామిడిద రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా ముర్ల బాలరాజు, దుచ్చరి పెంటన్న దొర, రైతు విభాగం అధ్యక్షుడిగా పోతురాజు కృష్ణబాబు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా దేశగిరి నాగులమ్మ, ప్రధాన కార్యదర్శిగా మామిడి శిరీషాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ పోస్టర్‌ను విడుదల చేశారు. వైస్ ఎంపీపీ దేముడు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, మండల యూత్ అధ్యక్షుడు కొర్ర బాబి, సోషల్ మీడియా అధ్యక్షుడు జంపరంగి విజయ కుమార్, వాణిజ్య విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు పనసల రజేష్, యువజన విభాగ అధ్యక్షుడు రమేష్, కంకిపాటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



అరకులోయలో ఆటో డ్రైవర్లతో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు


డుంబ్రిగుడలో ప్లకారులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు, సీఐటీయూ నాయకులు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: ఆటో డ్రైవర్లను రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు బుధవారం డిమాండ్ చేశారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో ఆటో యూనియన్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయా ప్రాంతాల్లో వేర్వేరుగా మట్లాడుతూ ప్రభుత్వం తీసుకొస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అప్పులు చేసుకుంటూ ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్ల ఉపాధిపై కూటమి ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించి కోరారు.

సీపీఐ సభలను విజయవంతం చేయండి

ఎటపాక: రంపచోడవరం ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము కోరారు. ఈ మేరకు బుధవారం గన్నవరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా ప్రజల పక్షాన పార్టీ పోరాడుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యుడు కంటీ రాజు, నాయకులు చిన్న, నాగరాజు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

హర్ ఘర్ తిరంగాపై అవగాహన ర్యాలీ



జాతీయ జెండా చేతపట్టి ర్యాలీకి సిద్ధం అవుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

అరకులోయ టౌన్/డుంబ్రిగుడ: అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మన జాతీయ జెండాను ఇంటిపైన ఎగరవేయాలని విద్యార్థులకు సూచించారు. సమాజంలో హర్ ఘర్ తిరంగాపై అవగాహన కలిగించడానికి ర్యాలీ నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీవో పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి.కొండబాబు, అధ్యాపకులు గణేష్, రాజు, లచ్చన్న, అప్పారావు, కామేశ్వరరావు, సోంబాబు, అంబిక, భవాని, వలంటీర్లు పాల్గొన్నారు.


జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కళాశాల సిబ్బంది

పాడేరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించి జాతీయ జెండాని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రసూల్, అధ్యాపకులు దామోదర్‌రావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


గొందిపాడులో ఉద్యోగులను సన్మానిస్తున్న ఎంపీపీ అప్పలరాజు, సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీలోన గొందిపాడు సచివాలయంలో అయిదేళ్లుగా విధులు నిర్వర్తించిన పలువురు సిబ్బంది ఇటీవల జరిగిన బదిలీల్లో వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. బదిలీపై వెళుతున్న సచివాలయ ఉద్యోగులకు బుధవారం ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యుడు చిన్నారావు తదితరులు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించటానికి, ప్రజా సమస్యలు పరిష్కరించటానికి సచివాలయ ఉద్యోగులు శ్రమించి ప్రజల మన్ననలు పొందారన్నారు. ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్ట్


పట్టుబడ్డ కిలో మచ్చరాజు

రోలుగుంట: గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి కిలో మచ్చరాజు (23)ని స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణారావు బుధవారం అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి జిల్లా చింతపల్లి మండలానికి చెందిన కిలో మచ్చరాజు మూడు మాసాల నుంచి తప్పించుకు తిరుగుతున్నాడని తెలిపారు. గాలించి పట్టుకున్న ఇతన్ని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరచగా 14 రోజుల రిమాండు విధించినట్టు తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించామని, ఎ–4గా ఉన్న మచ్చరాజు మాత్రం తప్పించుకు తిరుగుతూ బుధవారం పట్టుబడ్డాడని వివరించారు.

నేడు అమ్మవారి పండగ

అనకాపల్లి: పట్టణ, మండలంలో పలు ప్రాంతాల్లో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలను గురువారం నిర్వహిస్తున్నారు. ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గరపాలెం, కోట్నివీధి, గాంధీనగరం తదితర ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. కోట్నివీధిలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అరకులోయటౌన్/డుంబ్రిగుడ: అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తన చిన్ననాటి మిత్రుడు కొండబాబు మాస్టారు అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకొని బుధవారం పద్మాపురం మేజర్ పంచాయతీలోని కొండబాబు పార్థీవదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పాల్గుణ మాట్లాడుతూ తన మిత్రుని మరణం తనను ఎంతగానో కలిచివేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ మాజీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, నియోజకవర్గ సాంస్కృతిక విభాగ అధ్యక్షురాలు బంగురు శాంతి, నాయకుడు సాంబ, నరసింహమూర్తి, కృష్ణారావు, సింహాచలం, నరేష్, నాగేశ్వరరావు, బలరాం, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కొండబాబు పార్థీవ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు


కొండపాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు


అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదనరావు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు వ్యవసాయంలో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయతీ కేంద్రంతో పాటు కొండపాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో పాటించాల్సిన పద్ధతులు, జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజన రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని, ఆర్థికంగా ఎదిగే పంటలపై దృష్టి పెట్టాలని, పంటకు బీమాలు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని దీనిపై రైతులు దృష్టి సారించాలన్నారు. సర్పంచ్ నరసింగరావు, ఏకలవ్య సంస్థ సీఈవో రత్నకుమారి, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పి దామోదరం తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ఎర్రబొమ్మలు పంచాయతీలో మండల వ్యవసాయాధికారి టి.మధుసూదనరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. జీవ ఘనామృతాలు గురించి వివరించారు. పశువైద్యాధికారి షాలిని, పరిశోధన స్థానం శాస్త్రవేత్త జోగారావు, మాజీ ఎంపీటీసి సత్యనారాయణ, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అసిస్టెంట్‌లు విశ్వేశ్వరరావు, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జి.మాడుగుల: యువత ఏ దేశానికైనా ప్రధాన శక్తిని, దేశ అభివృద్ధిలో యువత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాదక ద్రవ్య రహిత భారత దేశ ప్రచారంలో పెద్ద సంఖ్యలో యువత చేరడం చాలా ముఖ్యమన్నారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో వారు ప్రతిజ్ఞ చేయించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, అల్లూరి సీతారామరాజు జిల్లాని మాదకద్రవ్య రహితంగా మార్చడానికి దృఢమైన నిర్ణయంగా తీసుకుందామని వారు పిలుపునిచ్చారు. దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చడానికి కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్, ఆధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


జి.మాడుగులలో ప్రతిజ్ఞ చేస్తున్న సీఐ శ్రీనివాస్‌రావు,ఎస్ఐ షణ్ముఖరావు,విద్యార్థులు

దోమల నివారణకు చర్యలు


బారంగిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

రంపచోడవరం: ముసురుమిల్లి, బారంగి గ్రామాల్లో దోమమందు పిచికారీని సర్పంచ్ కోసు రమేష్‌బాబుదొర, ఎంపీటీసీ కుంజం వంశీలు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమ నివారణ మందును ప్రతి ఇంట్లో స్ప్రే చేయించుకోవాలన్నారు. దీని వలన దోమల నివారణ జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పులతో చాలామంది జ్వరాల బారిన పడుతున్నారని, సకాలంలో ఆస్పత్రికి వెళ్లి వైద్య సేవలు పొందాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్, పాఠశాలలను సందర్శించారు. మధ్యాహ్న భోజనంలో పిల్లలకు వేడి నీటిని అందించాలని తెలిపారు. పాఠశాలలో నాడు–నేడు పనులు సగంలో ఉన్న వాటిని పూర్తి చేసేందుకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బా శేఖర్, ఎస్‌యూవో సత్యనారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాపన్నమ్మ, మహిళ పోలీస్ కృష్ణవేణి, రోషిణి తదితరులు పాల్గొన్నారు.